సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

కరుణించి కాపాడే ముత్యమాంబ

- అక్కయ్యపాలెం గ్రామదేవత ప్రధాన పండగ నేడు
- 200 ఏళ్లుగా భక్తుల నీరాజనాలు
- ఇక్కడి మూడు గుళ్లు ఓ ల్యాండ్ మార్క్
- అమ్మవారి మహోత్సవానికి గౌరీ సేవా సంఘం భారీ ఏర్పాట్లు



అలంకరణలో ముత్యమాంబ అమ్మవారు

సీతంపేట: పూర్వం ఎంతో మంది కారణాలు తెలియకుండా రోగాల బారిన, మృత్యువాత పడేవారు. వాటి నుంచి రక్షణగా, గ్రామాలకు కాపలాగా, పార్వతీదేవి ప్రతిరూపంగా గ్రామదేవతలను ఊరు పొలిమేరల్లో ప్రతిష్ఠించేవారు. కాలక్రమేణ గ్రామాలు పట్టణాలుగా అభివృద్ధి చెందాయి. ఒకప్పటి పొలిమేరలు నగరంలో ప్రధాన కేంద్రాలుగా మరాయి. మనిషి ఆధునికంగా మారినా పూర్వీకులు ఇచ్చిన నమ్మకాన్ని, సంస్కృతి, సంప్రదాయాలను ఇప్పటి తరాలు కొనసాగిస్తున్నాయి. భావితరాలకు వాటిని అందజేసేలా ప్రజలంతా ఉమ్మడిగా ఏటా అమ్మవారి జాతరలు అంగరంగ వైభవంగా జరిపిస్తున్నారు. ఇందులో భాగంగా విశాఖ నగరం నడిబొడ్డున గల అక్కయ్యపాలెంలో పూర్వం ముత్యమాంబ, భూలోకమాంబ, కుంచుమాంబ అమ్మవార్ల ఆలయాలను ప్రతిష్ఠించారు. నిత్యం గ్రామస్తులు పూజలు చేస్తూ ప్రజలను కాపాడాలంటూ వేడుకునే వారు. కాలక్రమేణా ఈ ఆలయాలను అభివృద్ధి చేయడంతో అక్కయ్యపాలెంలో మూడు గుళ్లు ఒక ల్యాండ్ మార్క్‌గా గుర్తింపు తెచ్చుకుంది. జీవీఎంసీ 42, 43, 44, 26 వార్డుల ప్రజలు అధిక సంఖ్యలో ఈ అమ్మవార్లను ఆరాధిస్తుంటారు.

ఊరంతా పండగ శోభ

అక్కయ్యపాలెం గ్రామదేవత ముత్యమాంబ పండగ మహోత్సవానికి గౌరీ సేవా సంఘం ఘనంగా ఏర్పాట్లు చేసింది. ఊరంతా పండగ శోభతో కళకళలాడుతోంది. అక్కయ్యపాలెం మెయిన్ రోడ్, జగన్నాథపురం, 80 ఫీట్ రోడ్, శ్రీనివాసనగర్, రామాలయం, కర్రివాని బ్రిడ్జి, జగ్గారావు బ్రిడ్జి రహదారులన్నింటినీ విద్యుత్ దీపాలు, ఎల్ఈడీ ఫ్లెక్సీలతో అలంకరించారు. ఆలయం వద్ద షామియానాలు, కొబ్బరాకులతో చలువ పందిర్లు సిద్ధం చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

ఘనంగా తొలేళ్ల సంబరం

ముత్యమాంబ అమ్మవారి పండగ మహోత్సవాల్లో భాగంగా సోమవారం తొలేళ్ల సంబరం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు రాజగిరి అప్పలరాజు మాట్లాడుతూ అమ్మవారి ప్రధాన పండగకు భారీ ఏర్పాట్లు చేశామన్నారు. మంగళవారం ప్రధాన పండగ అంగరంగ వైభవంగా జరుగుతుందన్నారు. ఉదయం అమ్మవారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజలు జరుగుతాయని, భక్తులు మొక్కులు చెల్లించుకోవచ్చని తెలిపారు. సాయంత్రం ఆర్కెస్ట్రా, బుర్రకథలు, డ్యాన్స్ బేబీ డ్యాన్స్, కూచిపూడి నృత్యం వంటి స్టేజి ప్రోగ్రామ్స్ ప్రధాన రహదారుల్లో ఏర్పాటు చేశామని చెప్పారు. గరిడీలు, పులివేషాలు, కోలాటం, తప్పెటగుళ్లు, తీన్‌మార్, నవదుర్గల డ్యాన్స్ వంటి సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. భక్తులంతా విచ్చేసి పండగను జయప్రదం చేయాలని కోరారు. సంఘ గౌరవాధ్యక్షుడు పెంటకోట సత్యనారాయణ, కమిటీ చైర్మన్ మళ్ల త్రినాథరావు, వైస్ చైర్మన్ ఆడారి పారుపల్లి రవి, ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి ఈశ్వర అప్పారావు, కోశాధికారి పిల్లా గోపి, ఆడిటర్ పొలమరశెట్టి అప్పలస్వామినాయుడు పండగ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.



అక్కయ్యపాలెంలో మూడు గుళ్ల వద్ద పండగ ఏర్పాట్లు





విద్యుద్దీప కాంతుల్లో ప్రధాన రహదారులు



200 ఏళ్ల చరిత్ర

అక్కయ్యపాలెంలో గ్రామ దేవతలను (మూడు గుళ్లు) సుమారు 200 ఏళ్ల కిందట ప్రతిష్ఠించారని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామ రక్షణకు, వ్యాధులు ప్రబలకుండా అప్పట్లో గ్రామంలో నివసించే గవర కులస్తులు, పెద్దలు ఒక కమ్మల పాకలో అమ్మవారిని ప్రతిష్ఠించారు. ఆ తర్వాత తరం వారు గానుగ సున్నంతో పెద్ద దిమ్మ నిర్మించి వేప కర్రలతో అమ్మవారి రూపాలను ప్రతిష్ఠించారు. కాలక్రమేణా గవర కులస్తులంతా కలిసి గుడిని నిర్మించగా.. గ్రామస్తులు గౌరీ సేవా సంఘంగా ఏర్పడి అమ్మవారి ఆలయాలను మరింత అభివృద్ధి చేశారు. భూలోకమాత, ముత్యమాంబ, కుంచుమాంబ అమ్మవార్లను ప్రతిష్ఠించి నిత్య పూజలు జరిపిస్తున్నారు. ప్రతి ఏటా జేష్ఠ మాసంలో ఒక అమ్మవారికి గ్రామస్తులంతా పెద్ద ఎత్తున పండగను ఉత్సవంలా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ముత్యమాంబ పండగ నిర్వహణకు సంఘ ప్రతినిధులు, గ్రామ పెద్దలు భారీ ఏర్పాట్లు చేశారు.

క్లుప్తంగా

వాల్తేర్ డివిజన్‌లో యోగా డే సన్నాహకాలు



రైల్వే స్టేషన్‌లో యోగాసనాలు వేస్తున్న రైల్వే, నేవల్ అధికారులు, సిబ్బంది

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో ఇండియన్ నేవల్ సర్వీసెస్ విశ్వకర్మ సహకారంతో అంతర్జాతీయ యోగా దినోత్సవం–2025 కోసం సన్నాహక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం విశాఖ రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ గేట్ వద్ద యోగా సాధన చేశారు. సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్–2 కె.పవన్‌కుమార్, 100 మంది రైల్వే ఉన్నతాధికారులు, 25 మంది నేవీ ఉన్నతాధికారుల నాయకత్వంలో సిబ్బంది విభిన్న యోగాసనాలు, ప్రాణాయామ, మెడిటేషన్ చిట్కాలు నేర్చుకున్నారు.

'బాల్య స్మృతులు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

మురళీనగర్: పట్టాభిరెడ్డితోటలోని వానప్రస్థ వృద్ధాశ్రమంలో విశాఖపట్నం గాంధీ సెంటర్, హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సోషల్ డైలాగ్స్ సంయుక్తంగా సోమవారం బాల్య స్మృతులు పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. రచయితల జ్ఞాపకాల సమాహారంతో కూడిన ఈ కార్యక్రమానికి తెలంగాణ అడ్వకేట్ అవధానం రఘుకుమార్ అధ్యక్షత వహించారు. రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ నందివెలుగు ముక్తేశ్వరరావు, రిటైర్డ్ వీసీ ప్రొఫెసర్ విశ్వనాథుని బాల మోహన్‌దాస్, డాక్టర్ ప్రయాగ మురళీమోహనకృష్ణ, వంగిపురం స్వర్ణలత పుస్తకాన్ని ఆవిష్కరించారు. రచయితలు, అతిథులు తమ బాల్య స్మృతులను గుర్తుకు తెచ్చుకున్నారు. కార్యక్రమంలో గాంధీ సెంటర్ కార్యదర్శి డాక్టర్ బి.రామారావు, జాయింట్ సెక్రటరీ డాక్టర్ కె.వి.ఎస్.మూర్తి, వృద్ధాశ్రమ నిర్వాహకుడు ఆర్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

వృద్ధుల సమస్యలకు సత్వర పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

విశాఖ–లీగల్: న్యాయస్థానాలలో వయోవృద్ధులకు సంబంధించిన వివాదాలు త్వరితగతిన పరిష్కారం కానున్నట్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు స్పష్టం చేశారు. సోమవారం కోర్టు ఆవరణలో ప్రపంచ వయోవృద్ధుల వేధింపులపై అవగాహన దినోత్సవాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంరక్షణ చట్టంలోని పలు కీలక అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా న్యాయ పీఠం అధ్యక్షులు జి.వల్లభనాయుడు, జిల్లా దివ్యాంగులు, వయోవృద్ధుల సంరక్షణ అధికారి కె.కవిత, సామాజిక కార్యకర్త ఎం.సత్యనారాయణ, న్యాయసేవాధికార సంస్థ ప్యానెల్ న్యాయవాదులు, పారా న్యాయ సహాయకులు, వయోవృద్ధులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త బాధ్యతల స్వీకరణ



ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త సింహాచలాన్ని అభినందిస్తున్న ఆచార్య హరనాథ్

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీ జాతీయ సేవా పథకం(ఎన్‌ఎస్‌ఎస్) సమన్వయకర్తగా చిత్రకళా విభాగాధిపతి డి.సింహాచలం సోమవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆచార్య ఎస్.హరనాథ్, పలువురు ఆచార్యులు, ఉద్యోగులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలియజేశారు.

'యోగాంధ్ర'కు సిద్ధం కండి



యోగాసనాలు వేస్తున్న మురళీనగర్ వాసులు

మురళీనగర్: ఈ నెల 21న నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనేందుకు సిద్ధంగా ఉండాలని జోనల్ కమిషనర్ బి.రాము పిలుపునిచ్చారు. మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో పార్కు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంయుక్తంగా సోమవారం నిర్వహించిన యోగా సాధన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి రోజు యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో ఉచిత బస్సులు ఏర్పాటు చేశామని, ఆరోజు ఉదయం 4 గంటలకు యోగాసనాలు వేసే అభ్యర్థులు, ఆసక్తి గల వారు బస్సుల్లో యోగా ప్రాంతానికి చేరుకోవాలని చెప్పారు. వీరికి ఉచితంగా టీ–షర్టులు, మ్యాట్స్, స్నాక్స్ అందిస్తామన్నారు. విశాఖలో నిర్వహించనున్న యోగా దినోత్సవం వైపు ప్రపంచం మొత్తం చూస్తోందని, ప్రజలు విజయవంతం చేయాలని జెడ్సీ కోరారు. కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొంటారన్నారు. సుమారు 500 మంది స్థానికులు పాల్గొని యోగాసనాలు వేశారు. పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, కార్యదర్శి పి.వి.ఎస్.ఎన్.రాజు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు పృథ్వీరాజు, శంకర్ నారాయణ పాల్గొన్నారు.

క్రైస్తవులకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ కేటాయించాలి



పాదయాత్ర కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఐక్య క్రైస్తవ కోర్ కమిటీ ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: రెండు తెలుగు రాష్ట్రాల క్రైస్తవుల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను కేటాయించాలని ఆలిండియా ఐక్య క్రైస్తవ జేఏసీ కోర్ కమిటీ చైర్మన్ తుమాటి బాబూరావు కోరారు. ద్వారకానగర్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రైస్తవుల అభ్యున్నతి, సంక్షేమం, భద్రత కోసం మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. దీని వల్ల క్రైస్తవుల విద్యాలయాలు, దేవాలయాలు, వైద్యాలయాలను కాపాడుకోగలమని తెలిపారు. ఈ డిమాండ్ సాధనకు జూలై 31న విశాఖ బీచ్ రోడ్డులోని వైఎంసీఏ లేదా వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి క్రైస్తవులు భారీ పాదయాత్ర నిర్వహించాలనుకుంటున్నట్లు తెలిపారు. ఈ పాదయాత్రలో నగర క్రైస్తవులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పాదయాత్ర కరపత్రికను కోర్ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయా ప్రాంతాల పాస్టర్లు ఎజ్జల బాలరాజు, లోపింటి శామ్యూల్, బాబ్జిరావు, కె.సాంబశామ్యూల్, రమేష్, ఎస్తేరు రాణి ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ ఎస్తేరు రాణి తదితరులు పాల్గొన్నారు.

2.5 కిలోల గంజాయి పట్టివేత



ఎక్సైజ్ అధికారుల అదుపులో గంజాయి, రవాణాదారుడు

విశాఖ సిటీ: ఒడిశా నుంచి బెంగుళూరుకు గంజాయి తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన వ్యక్తిని ఎక్సైజ్ శాఖ అధికారులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా.. అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.వి.మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ సిబ్బంది జ్ఞానాపురంలో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో రాజేష్ అనే వ్యక్తి వద్ద 2.5 కిలోల గంజాయిని గుర్తించారు. అతడిని విచారించగా.. ఒడిశా రాష్ట్రంలో దర్లిపుట్ నుంచి కేజీ రూ.5 వేలకు కొనుగోలు చేసి అధికంగా అమ్ముకునేందుకు బెంగళూరుకు వెళ్తున్నట్లు చెప్పాడు. దీంతో అతడిని అరెస్టు చేసి సీతమ్మధార ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు. తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ సిహెచ్.రాజేశ్వరి, ఎస్‌ఐ ఎల్.అరుణకుమారి, హెచ్‌సీ కె.వెంకటరావు, కానిస్టేబుళ్లు కె.వీరభద్రరావు, జి.విజయ్‌కుమార్, ఎ.దేవీచంద్ర, ఎస్.తిరుపతిరావు, ఎం.మహేశ్వరి పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: అతిసార వ్యాధి నివారణ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు సూచించారు. డయేరియాపై అవగాహన కల్పిస్తూ వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు నిర్వహించిన ర్యాలీని సోమవారం ఆయన ప్రారంభించారు. రేసపువానిపాలెంలోని డీఎంహెచ్‌వో జిల్లా కార్యాలయం నుంచి సత్యం కూడలి మీదుగా తిరిగి డీఎంహెచ్‌వో కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఈనెల 16 నుంచి జూలై 31 వరకు జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ బి.లూసీ కార్డిలియా, జిల్లా ఆస్పత్రి సేవా సమన్వయకర్త డాక్టర్ పి. శంకర ప్రసాద్, జిల్లా ప్రోగ్రాం అధికారులు, పారా మెడికల్ సిబ్బంది, ప్రభుత్వ ప్రాంతీయ శిక్షణ కేంద్ర నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

నయవంచనకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు

- ఏడాది పాలనంతా అరాచకాలు, దాడులే
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు
- 'జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం' పుస్తకావిష్కరణ



మాట్లాడుతున్న కె.కె.రాజు



పార్టీ శ్రేణులతో కలిసి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు

సీతంపేట: అబద్ధాలతో ప్రజలను మోసం చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు విమర్శించారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం నూటికి నూరు శాతం విఫలమైందన్నారు. చంద్రబాబు ఏడాది పాలనపై వైఎస్సార్‌సీపీ రూపొందించిన జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని అబిద్‌నగర్ షాదీఖానాలో సోమవారం పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తొలి ఏడాదిలోనే మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 90 శాతానికి పైగా అమలు చేశారని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలంటూ చంద్రబాబు ప్రజలను మభ్యపెట్టి, గెలిచాక ఏ ఒక్క పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో అరాచకాలు, దాడులు, ప్రశ్నించిన వారిపై కేసులు, అరెస్టులతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారన్నారు. మహిళలు, బాలికలపై లైంగిక దాడులు పెరిగాయని, సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు.

పార్టీ బలోపేతానికి సమష్టి కృషి

ఏడాది తర్వాత పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులను కలవడం సంతోషంగా ఉందని కె.కె.రాజు అన్నారు. ఐదేళ్ల పాటు చిత్తశుద్ధితో ఉత్తర నియోజకవర్గ ప్రజలకు సేవలందించానని, వారి తీర్పు నిరాశకు గురిచేసిందన్నారు. తనతోపాటు పార్టీ శ్రేణులు కూడా నిరాశ, నిస్పృహలను వీడి మళ్లీ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యేలా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కూటమి పాలకుల అరాచకాలు, వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సంక్షేమ పథకాలు అమలు చేస్తే ప్రజలకు మేలు చేసిన వారమవుతామన్నారు. రానున్న ఎన్నికల్లో విశాఖలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగిరేలా సమష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల పార్టీ అధినేత వైఎస్ జగన్ పాల్గొన్న కార్యక్రమాలకు స్వచ్ఛందంగా వస్తున్న జన ప్రభంజనాన్ని చూసి కూటమి మంత్రులకు చెమటలు పట్టాయన్నారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ మాట్లాడుతూ రానున్న నాలుగేళ్లు కూటమి ప్రభుత్వ అరాచకాలు, దుష్ప్రచారాలను సమష్టిగా తిప్పికొట్టాలని పిలునిచ్చారు. తల్లికి వందనం పథకానికి రాష్ట్రంలో 67 లక్షల మంది అర్హులుంటే.. కేవలం 37 లక్షల మందికే డబ్బులు వేశారన్నారు. తల్లికి వందనం అర్హుల జాబితా స్కూళ్లు, సచివాలయాల్లో లేదని, చాలా మంది డబ్బులు జమకాక తిరుగుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు రొంగలి జగన్నాథం, పేడాడ రమణి, సాడి పద్మారెడ్డి, అల్లు శంకరరావు, బర్కత్ అలీ, వావిలపల్లి ప్రసాద్, శశికళ, సేనాపతి అప్పారావు, పామేటి బాబ్జి, పైడి రమణ, దుప్పలపూడి శ్రీనివాస్, మల్లీశ్వరి, రవిరాజు, మువ్వల పోలారావు, కె.వి.బాబా, గుజ్జు వెంకటరెడ్డి, బొగ్గ శ్రీను, అప్పల నరసింహం, అనుబంధ సంఘాల నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

పైల దివాకర్‌కు కె.కె.రాజు పరామర్శ



దివాకర్‌ను పరామర్శించి ఆరోగ్య స్థితిని తెలుసుకుంటున్న కె.కె.రాజు

తాటిచెట్లపాలెం: వైఎస్సార్‌సీపీ కార్యాలయ పీఆర్వో పైల దివాకర్‌ను తాటిచెట్లపాలెంలోని నివాసంలో సోమవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు పరామర్శించారు. లివర్, జాండిస్ సమస్యతో రెండు నెలలుగా బాధపడుతున్న పైల దివాకర్ తక్షణ వైద్య ఖర్చుల నిమిత్తం కె.కె.రాజు రూ.20 వేల ఆర్థిక సాయం చేసి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాస్, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సేనాపతి అప్పారావు, పైడి రమణ, నీలి రవి, హరి పట్నాయక్, నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను తక్షణం పరిష్కరించాలి

మద్దిలపాలెం: అంగన్‌వాడీల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్యామలాదేవి డిమాండ్ చేశారు. ఇసుకతోట కృష్ణ మందిరం రోడ్డులోని ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ అంగన్‌వాడీ సెంటర్ వద్ద సోమవారం అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతున్న ప్రజా సాధికార సర్వేలో అంగన్‌వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగి అనే నమోదును ప్రక్రియ నుంచి తొలగించాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలన్నీ అంగన్‌వాడీ టీచర్లు, మినీ టీచర్లు, ఆయాలకు కచ్చితంగా వర్తింపజేయాలన్నారు. ప్రతి నెలా 5వ తేదీకి గౌరవ వేతనాల బిల్లును అకౌంట్‌లో జమ చేయాలని కోరారు. పిల్లలకు వండి వడ్డించే మెనూ రేట్లు పెంచాలని, అంగన్‌వాడీ కేంద్రాలకు సరకులన్నీ ప్రభుత్వమే చేర్చాలని సూచించారు. ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు వెంటనే పెంచాలని, అంగన్‌వాడీ సెంటర్లకు రేషన్ సన్న బియ్యం సప్లై చేయాలని డిమాండ్ చేశారు. యాప్స్‌ను తక్షణమే సవరించాలని కోరారు. అసోసియేషన్ ప్రతినిధులు రమాదేవి, పి.కృపారాణి, రమ తదితరులు పాల్గొన్నారు.

నార్త్ ఎస్సీ విభాగ అధ్యక్షుడిగా లక్ష్మణరావు

సీతంపేట: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ ఉత్తర నియోజకవర్గ ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా దొండపర్తి లక్ష్మణరావును నియమించారు. ఈ మేరకు సోమవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.



జేపీఎల్ విజేత పరవాడ జట్టు

తాటిచెట్లపాలెం: జర్నలిస్ట్స్ ప్రీమియర్ లీగ్(జేపీఎల్) విజేతగా పరవాడ జట్టు నిలిచింది. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఏపీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో పోర్టు స్టేడియంలో 5 రోజుల పాటు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో మ్యాచ్‌లు జరిగాయి. సోమవారం రాత్రి నిర్వహించిన ఫైనల్స్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన గాజువాక జట్టు 75 పరుగులు చేయగా.. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పరవాడ జట్టు ఒక బాల్ మిగిలి ఉండగానే లక్ష్యాన్ని చేధించి, ట్రోఫీని సొంతం చేసుకుంది. గాజువాక జట్టు రన్నరప్‌గా నిలిచింది. మ్యాచ్‌ల ముగింపు కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.రాము, ప్రధాన కార్యదర్శి ఆర్.రామచంద్రరావు, స్మాల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.సత్యనారాయణ, ఏపీయూడబ్ల్యూజే గాజువాక శాఖ అధ్యక్షుడు కె.పరశురాం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.చంద్రమోహన్, హరనాథ్, నారాయణ గ్రూప్ గంటా రవి, శృతి టిఫిన్స్ రాజు, పవిత్ర రెడ్డి కన్‌స్ట్రక్షన్స్ శ్రీనవాస్‌రెడ్డి, టెక్ విజన్ రాజీవ్ సెంటా, ఈటోర్ నాగేశ్వరరావు, మైపైసా ఎర్రాజీ, పెప్సీ జోగేంద్రకుమార్, సుమంత్ అసోసియేట్స్ సుమంత్, గోల్డెన్ ఫ్యూచర్ డెవలపర్స్ శ్రీనివాస్, శ్రీ బాలాజీ డెవలపర్స్ గణేష్‌కుమార్, లక్కీ షాపింగ్‌మాల్ స్వామి, మ్యాక్ డాక్టర్ శ్రీవల్లి, శ్రీ కశ్యప్ విద్యానికేతన్ కె.శ్రీనివాస్, నిర్వాహకులు రవి, చందు యాదవ్, అవతార్ యాదవ్, రాహుల్, భరత్ మిత్ర బృందం, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com